విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

ప్రైవేట్ పాఠశాలల సమ్మేళనం

విశాలాంధ్ర-వెలిగండ్ల : విజయవాడలో రాష్ట్ర ప్రవేటు పాఠశాలల సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి కనిగిరి నియోజకవర్గం ప్రైవేట్ పాఠశాల అధ్యక్షులు రాయ. గుంటయ్య, ప్రకాశం జిల్లా జాయింట్ సెక్రెటరీ ముక్కు వెంకటేశ్వర్ రెడ్డి కృష్ణారెడ్డి ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయ. గుంటయ్య మాట్లాడుతూ పాఠశాలలు నడిపే విధానంపై చర్చించడం జరిగిందని అన్నారు.

యర్రగొండపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : సర్వేంద్రియానం నయనం ప్రధానమని పెద్దలు చెప్పినట్లుగా శారీరకంగా మనం ఎంత బలంగా ఉన్నప్పటికీ కంటి చూపు సరిగా లేనిదే జీవనం కష్టసాధ్యమని యర్రగొండపాలెం ఏరియా వైద్యశాల డిఎం అండ్ హెచ్‌వో డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం యర్రగొండపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బ్రహ్మంగారి గుడి పక్కనలో ప్రజా ఆరోగ్య పరిరక్షణ సౌజన్యంతో (సీపీఐ) శంకర కంటి ఆసుపత్రి రూరల్ హోప్ ఫౌండేషన్, అమెరికా, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 159 మందికి వైద్య పరీక్షలు చేయగా 47 మందిని శుక్లాలు ఆపరేషన్‌కు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు భక్తి, బితిని, యోగిత, సీపీఐ సీనియర్ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, త్రిపురాంతకం మండల కార్యదర్శి బాణాల రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొండిశెట్టి, బత్తులను పరామర్శించిన టీడీపీ నేతలు

విశాలాంధ్ర-పామూరు : నెల్లూరులో వైద్య చికిత్సలు పొంది నివాస గృహములో విశ్రాంతి తీసుకుంటున్న బీజేపీ రాష్ట్ర నాయకులు కొండిశెట్టి వెంకట రమణయ్యను, రోడ్డు ప్రమాదంలో గాయపడి నివాస గృహంలో విశ్రాంతి తీసుకుంటున్న మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి భక్తుల సత్యనారాయణలను ఆదివారంమండల తెలుగు యువత నాయకులు, మాజీ ఎంపీటీసీ ఉప్పల పాటి హరిబాబు, పాలపర్తి వెంకటేశ్వర్లు, నరసింగు సాంబయ్య, బండ్ల నారాయణలు పరామర్శించారు.

నారాయణస్వామి సన్నిధిలో దారపనేని

విశాలాంధ్ర-పామూరు : ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీ శ్రీ శ్రీ నారాయణ స్వామి దేవస్థానమును ఆదివారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారి పట్టు వస్త్రంతో దారపనేని ని సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదములు అందజేశారు. మిరియం సుబ్బారాయుడు(ఎమ్మెస్సార్ చౌదరి) దారపనేని నరసింహనాయుడు జాజం హరికృష్ణ స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

హోం హోరీగా లడ్డు వేలం పాట

విశాలాంధ్ర-ముండ్లమూరు : వినాయక చవితి పండుగ సందర్భంగా ముండ్లమూరులోని నాగారుపమ్మ దేవాలయం వద్ద వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఏడు రోజులుగా వినాయక స్వామివారిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించారు. స్వామి వారి వద్ద ఉన్న ఐదు కేజీల లడ్డుకు వేలంపాట నిర్వహించగా గ్రామానికి చెందిన జమ్ముల పెద్ద తిరుపతి రావు యాదవ్ 15 వేలకు పాట పాడి పాట దక్కించుకున్నాడు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్ర మంలో యువత ఉత్సాహంగా పాల్గొని ఉట్టిని జమ్ముల చెన్నారావు యాదవ్ కొట్టాడు.

అంగన్వాడీ కార్యకర్తలకు నోటీసులు

విశాలాంధ్ర-పామూరు : అంగన్వాడి సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ, సీఐటీయూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 25వ తేదీన విజయ వాడలో జరుగు ధర్నాకు వెళ్లరాదని పోలీసులు అంగన్వాడీ కార్యకర్తలకు ఆదివారం నోటీసులు జారీ చేశారు. నోటీసు ఉల్లంఘించిన యెడల చట్టప్రకారం తగిన క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని నోటీసులో పోలీసులు హెచ్చరించారు.

గణేష్ నిమజ్జన కార్యక్రమం

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని పలు గ్రామాలలోని వీధులలో వినాయకుడి ప్రతిమలను ఏడో రోజు ఆదివారం విశేషంగా అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. యువకులు కేరింతల కొడుతూ డాన్సులు వేస్తూ సందడి చేశారు. ఊరి చివరన గల చిలకలేరు వాగులో నిమజ్జనానికి తరలించారు.

శాస్త్రవేత్తగా సెయింట్ మార్క్స్ విద్యార్థి

విశాలాంధ్ర-పామూరు : స్థానిక సెయింట్ మార్క్స్ ఉన్నత పాఠశాలలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యనభ్యసించిన మోరబోయిన ఆదిత్య కిషోర్ తరువాత అగ్రికల్చర్ కోర్సులో మాస్టర్ డిగ్రీ పొంది, అన్నామలై యూనివర్సిటీ నుండి పీ.హెచ్.డి పట్టా పొంది ప్రస్తుతం ఒడిశాలోని సంబల్‌పూర్‌లో క్రొత్త క్రొత్త వంగడాలను కనుగొనే శాస్త్రవేత్తగా పనిచేయుచున్నారు. ఆదివారం సెయింట్ మార్క్స్ ఉన్నత పాఠశాల కార్యక్రమంలో ఆదిత్య కిషోర్ మాట్లాడుతూ పామూరు లాంటి ఒక మారుమూల ప్రాంతంలో విద్యనభ్యసిం చిన విద్యార్థులకు ఒక రకమైన ప్రతికూల వైఖరి ఉండేది. కాబట్టి విద్యార్థులు ఒక నిర్దిష్ట లక్ష్యంతో ఉన్నత ప్రమాణాలతో నిరంతర కృషితో ఉన్నత స్థాయికి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ఆదిత్య కిషోర్‌ను ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్ యం.జయకుమార్, ఉపాధ్యాయ సిబ్బంది మరియు విద్యార్థులు సన్మానించారు.

శాఖా గ్రంథాలయంలో చదవడం నాకిష్టం

విశాలాంధ్ర-టంగుటూరు : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథ పాలకులు గుమ్మడి వర్ధనరాజు ఆధ్వర్యంలో చదవటం నాకిష్టం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పిల్లలు విరివిగా పాల్గొని చదువుకుంటున్నారు. కావున గ్రామస్థులు అందరూ తమ పిల్లలను చదవటం నాకిష్టం కార్యక్రమములో పాల్గొనేలా చేసి మేధావులు, శాస్త్రవేత్తలుగా అయ్యేలా కృషి చేయాలని గ్రంథ పాలకులు కోరారు.

విద్యుత్ భారాలను వ్యతిరేకిద్దాం

- 27న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి
- వామపక్ష పార్టీల పిలుపు

కరపత్రాన్ని విడుదల చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

విశాలాంధ్ర-ఒంగోలు : విద్యుత్ బిల్లులు పెంపుకు నిరసనగా ఈనెల 27న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో ఆదివారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రాష్ట్రానికి మరిన్ని అప్పులు తెచ్చేందుకు వీలుగా కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకుని 2022 విద్యుత్ సంస్కరణలను వేగవంతం చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. 100 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు పథకం అటకెక్కించారన్నారు. నాలుగున్నర సంవత్సరాల వైసీపీ పాలనలో ఏడుసార్లు విద్యుత్ బిల్లులు పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపార న్నారు. ఈపాటికి ట్రూ అప్ చార్జీల పేరుతో, సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచారు అన్నారు. కేంద్రంలోని బీజేపీ ఆదేశాల మేరకు జగన్ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచుతుం దన్నారు. అయితే ఈపాటికి బీజేపీ పాలిత రాష్ట్రాలు విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకిస్తున్నా యన్నారు. అయితే జగన్ ప్రభుత్వం మాత్రం విద్యుత్ సంస్థలను అమలు చేసి ప్రజలపై మరింత భాగాలు మోపేందుకు ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ బిల్లు లకు వ్యతిరేకంగా ఈనెల 27న జరిగే ధర్నాలు ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణ అమలు జరిగితే వ్యవసాయరంగం మరింత సంక్షోభంలో కూరుకుపోతుందన్నారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం ఎందుకు, బిల్లులు వేయటం ఎందుకు, వాటిని తిరిగి ప్రభుత్వం చెల్లించడం ఎందుకని ప్రశ్నించారు. సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి విద్యుత్ సంస్కరణ కారణంగా రాష్ట్ర ప్రజలపై రూ .50 కోట్ల అదుపు భాగం పడుతుందని అన్నారు. దేశంలోని సంపదను అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టపెట్టేందుకు మోడీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలను అమలు చేసి సామాన్య ప్రజలపై మరింత భాగాలు వేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు కే హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజాగ్రహం గురుగాక ముందే విద్యుత్ సంస్కరణలను వెనక్కి తీసుకొని ప్రజలపై భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఆర్.వెంకట్రావు, సీపీఐ ఒంగోలు నగర కార్య దర్శి పివి ఆర్ చౌదరి, సీపీఎం జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు జివి కొండారెడ్డి, కంక ణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, సీపీఐ ఎంఎల్ నాయకురాలు ఎస్ లలిత కుమారి పాల్గొన్నారు.

వందే భారత్ రైళ్ల ప్రవేశంతో రైలు ప్రయాణంలో నూతన శకం

జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : వందే భారత్ రైళ్ల ప్రవేశంతో రైలు ప్రయాణంలో నూతన శకం ఆరంభమైందని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ అన్నారు. విజయవాడ నుంచి చెన్నైకి ప్రవేశపెట్టిన నూతన వందే భారత్ రైలు మొదటి ప్రయాణంలో భాగంగా ఆదివారం. మధ్యాహ్నం ఒంగోలు రైల్వే స్టేషన్ కు చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్, పలువురు ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వందే భారత్ రైలుకు ఘన స్వాగతం పలికారు. పలువురు ప్రయాణికులు వందే భారత్ రైలును ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వందే భారత్ రైలులో ఎన్నో సౌకర్యాలు ఉన్నాయన్నారు. దీనివల్ల ప్రయాణ సమయం తగ్గుతుందన్నారు. ఒంగోలు ప్రాంత వాసులకు చెన్నై, తిరుపతి వెళ్లడానికి ఈ వందే భారత్ రైలు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. అంతేకాక, ఒంగోలు రైల్వే స్టేషన్‌లో 26 కోట్ల రూపాయల వ్యయంతో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. తన కుమారుడు, కుమార్తెతో కలిసి సింగరాయకొండ వరకు ఆయన ఈ రైలులో ప్రయాణించారు. దీనిలోని సౌకర్యాలను ఆసక్తిగా పరిశీలించి, ప్రయాణికులతో ముచ్చటించారు. ఇంత సౌకర్యవంతమైన రైలును ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకున్న ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రైలును తయారు చేసిన ఇంజనీర్లకు కూడా ఆయన అభినందనలు తెలిపారు. వంటి భారత్ రైలులో ప్రయాణించడం గొప్ప అనుభూతిని ఇచ్చిందన్నారు.

కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల్ని పర్మినెంట్ చేయాలి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్

విశాలాంధ్ర-కనిగిరి : రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులతోపాటు ఇంజనీరింగ్ కార్మికులు, డ్రైవర్లను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కనిగిరి ఒంగోలు బస్టాండ్ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద మానవ హారం నిర్వహించి ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా యాసీన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మడమ తిప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనంతో పాటు ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కరోనా సమయంలో తీసుకున్న కార్మికులను అప్కాస్‌లో నమోదు చేసి జీతాలు చెల్లించాలని, పర్మినెంట్ కార్మికుల జీపీఎఫ్ ఖాతాల తీయాలని, సరెండర్ లీవుల ఎన్క్యాష్మెంట్ 2 యేండ్లు దాటినా విడుదలపై ప్రభుత్వంలో చలనమే ఆవేదన వ్యక్తం చేశారు. కనిగిరి నియోజకవర్గం అధ్యక్షుడు గుజ్జుల బాలిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి కార్మికుల సమస్యలు పట్టవని కార్మికులను బానిసలుగా చిన్న చూపు చూస్తే సహించేది లేదన్నారు. ఈనెల 21 నుంచి 27 వరకు కార్మికులు దశలవారీగా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని సత్వరమే సమస్యల పరిష్కారం చేసినట్లు అసెంబ్లీలో జీవో విడుదల చేయాలన్నారు. డిహెచ్పిఎస్పి జిల్లా కార్యదర్శి పందిటి మోహన్ కార్మికుల నిరసన కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్య దర్శులు ఆలూరి కోటయ్య, అశోక్, ఏఐటియుసి సభ్యులు మస్తాన్, సుబ్రమణ్యం, చింతగుంట్ల రవి, రత్తయ్య, సుధాకర్, పవన్, రహిమాన్, మధు, ఐజక్, తిరుపతయ్య, ఇమాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సరస్వతి'లో జాతీయ సేవా పథకం దినోత్సవం

ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు, ఉపాధ్యాయులు

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక మంగామూరు రోడ్ లోని శ్రీ సరస్వతి డిగ్రీ కాలేజ్ నందు ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యలో జాతీయ సేవా పథకం దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఎవి రమణా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ప్రతి ఒక్కరూ సమాజ సేవా కార్యక్రమాల్లోపాల్గొంటూ సేవా దృక్పథంను అలవర్చుకోవాలి అలాగే సమాజ సేవలో భాగస్వాములు కావాలి అని పేర్కొన్నారు.ఉన్నత చదువు చదివే నేటి యువతకు విద్య,విజ్ఞానంతో పాటు సమాజ సేవ పట్ల బాధ్యత వహించాలి అని తెలిపారు.గాంధీజీ శత జయంతి పురస్కరిచుకుని భారత ప్రభుత్వం 24 సెప్టెంబర్ 1969 నుండి ఎన్ఎస్ఎస్ డే గా ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ గణేష్ రెడ్డి,గంగా శంకర్ రెడ్డి,సిఇఓ వెంకట సురేష్,ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ టి రాజేంద్ర బాబు మరియు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుకు వైసీపీ మూల్యం చెల్లించక తప్పదు

దీక్ష చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర, తెదేపా నాయకులు

విశాలాంధ్ర-కనిగిరి : సైకో ప్రభుత్వం చంద్రబాబుపై చేస్తున్న అబద్ధపు ప్రచారాలను నమ్మవద్దని, చంద్రబాబు నాయుడిని అక్రమ అరెస్టు చేసినందుకు వైసీపీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని మాజీ ఎమ్మెల్యే, తెదేపా ఇన్‌ఛార్జ్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్ ఆదివారం సామూహిక రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. 12వ రోజు పామూరు మండల టీడీపీ శ్రేణులు పాల్గొని వినూత్నంగా చెడు చూడకు, చెడు వినకు, చెడు మాట్లాడకు అంటూ ప్లకార్డులు పట్టుకుని దీక్ష చేశారు. పామూరు మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం వచ్చింది మొదలు ఆంధ్రప్రదేశ్‌లో రాక్షస పాలన సాగుతోందన్నారు. సైకో పాలనలో అబద్ధాలను నిజాలుగా నమ్మించి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఉగ్ర మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఏ తప్పు చేయకపోయినా అక్రమంగా జైలులో పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నార న్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఈ దుర్మార్గపు పాలనను బుద్ధి చెప్పాలని కోరారు. చంద్రబాబు జైలులో ఉన్నంత మాత్రాన టీడీపీని నిర్వీర్యం చేయాలని జగన్ పగటి కలలు కంటున్నాడు అది కలలో కూడా జరగదని చెప్పారు. ఈ దీక్షల్లో పామూరు మండల నాయకులు రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్, జిల్లా అధికార ప్రతినిధి యారవ ప్రసాద్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గుంటుపల్లి శ్రీనివాసులు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, మాజీ ఎంపీటీసీ ఇర్రి కోటిరెడ్డి, జిల్లా కార్యదర్శి సయ్యద్ అమీర్ బాబు, పామూరు టౌన్ అధ్యక్షుడు షేక్ ఖాజా రహంతుల్లా, రాష్ట్ర బీసీ నాయకుడు మొరబోయిన గంగరాజు యాదవ్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు తడికమల్ల సుబ్బారావు, పామూరు మండల తెలుగు యువత అధ్యక్షుడు పందిటి హరీష్, యూనిట్ ఇన్చార్జ్ గోళ్ళ వీరబాబు, మండల తెలుగు రైతు అధ్యక్షుడు మన్నెం రమణయ్య, బూత్ కమిటీ కన్వీనర్ శేషం మోషే, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు మర్నేని రామకృష్ణ, గుత్తి మహేష్, తెలుగు మహిళ ఓరుగంటి సుబ్బమ్మ, శివశంకర్, పునాటి వెంకటేశ్వర్లు, పువ్వాడి రామారావు, తుపాకుల వెంకటేశ్వర్లు, గౌస్ బాషా, హాజరత్, జింకా మధు, కంచర్ల శ్రీను, దారపనేని మాధవరావు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం

విశాలాంధ్ర-పీసీపల్లి : ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మండలంలోని శంకరాపురం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు పామూరు మండలంలోని ఇనిమెర్ల గ్రామం నుండి పీసీపల్లి మండలం పెదఇర్లపాడు గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తు మార్గమధ్యలో పిసిపల్లి మండలంలోని శంకరాపురం గ్రామ సమీపంలోకి వచ్చేసరికి ద్విచక్ర వాహనం చైను తెగిపోవడంతో అదుపుతప్పి పామూరు మండలం ఇనిమేర్ల గ్రామానికి చెందిన బండ్లమూడి బ్రహ్మానాయుడు (35) సంవత్సరాలు అనే వ్యక్తి శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతి చెందాడు. ఆదివారం ఉదయం ఆ రహదారి గుండా ప్రయాణించేవారు స్థానిక ఎస్సై కే మాధవరావుకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కనిగిరి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

తొమ్మిది లక్షల విలువగల గోవా మద్యం స్వాధీనం

విశాలాంధ్ర - సింగరాయకొండ : గోవా నుంచి అక్రమంగా సింగరాయకొండ స్టేషన్ పరిధిలోని జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట గ్రామంలో తొమ్మిది లక్షల విలువగల గోవా మద్యం బాటిలను సేబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సేబ్ ఇన్చార్జ్ డిఎస్పి ఎం.సుధీర్ బాబు తెలిపారు.ఆదివారం సింగరాయకొండ మండలం మూలగుంటపాడు పంచాయతీలో ఉన్న సేబ్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలిపారు.వివరాల్లోకి వెళితే కే.బిట్రగుంట గ్రామానికి చెందిన మాధవి అనే మహిళ నివాసంలో గోవా మద్యం బాటిల్లను విక్రయిస్తుందని డిఎస్పి తెలిపారు.మహిళ ఇంటిలో సోదాలు నిర్వహించగా గోవా మద్యం సీసాలు కనుగొన్నమన్నారు.కారులో గోవా నుంచి సింగరాయకొండకు మద్యం బాటిళ్లు రవాణా చేస్తున్నట్టు పేర్కొన్నారు.271(750 ఏం.ఎల్),816(180 ఏం.ఎల్) మొత్తం 1087 బాటిల్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటి విలువ సుమారు తొమ్మిది లక్షల రూపాయల వరకు ఉంటుందన్నారు.ఈ మద్యం బాటిల్లు అన్ని ప్రీమియం బ్రాండ్లు మద్యం సీసాలుగా ఉన్నాయన్నారు.తణుకు చెందిన గోవా మద్యం బాటిళ్లు సరఫరాదారు పాపినాయుడు అతని సహాయకుడు బాలాజీ ఇద్దరు కారులో గోవా మద్యం బాటిల్ తరలించి మూడు రోజుల వ్యవధిలో మాధవికి ఈ మొత్తం బాటిలను సరఫరా చేసినట్లు తెలిపారు.ఈ అక్రమ మద్యం తరఫురాలు మొత్తం ఐదుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు.ఈ సోదాల్లో ఎస్ఇబి ఒంగోలు,జెడి బృందం సిఐ,ఎస్సిబి స్టేషన్ సింగరాయకొండ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడుతుంది

- టీడీపీ ప్రభంజనాన్ని అడ్డుకోవడం ఎవరి తరం కాదు
- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల
- వైసీపీ నుండి గిద్దలూరు నియోజకవర్గంలో టీడీపీకి భారీ చేరికలు

ఒంగోలు ఫోటో.23: గిద్దలూరు జెడ్పీటీసీ మధుసూదన్ యాదవ్ ను టిడిపిలోకి కడువా కప్పి ఆహ్వానిస్తున్న దామచర్ల, నూకసాని

విశాలాంధ్ర -ఒంగోలు : నిర్బంధాలతో, కుట్రలతో, కుయుక్తులతో, పోలీసు బలగాలతో, అక్రమ కేసులతో, వేధింపులతో టీడీపీ ప్రభంజనాన్ని ఎవరు ఆపలేరని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ రావు పేర్కొన్నారు. ఒంగోలు టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్, జిల్లా అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీ ఆధ్వర్యంలో గిద్దలూరు జడ్పీటీసి బుడత మధుసూదన్ యాదవ్ ను కండువా కప్పి టీడీపీలోకి గౌరవంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులను కక్షపూరితంగా, నేరాలు మోపటం లక్ష్యంగా పాలన సాగుతుందని పేర్కొన్నారు. అందులో భాగంగానే టీడీపీని బలహీనపరిచేందుకు చంద్రబాబు నాయుడు అరెస్టు ఎటువంటి నేర పూరిత ఆధారాలు లేకుండా అరెస్టు చేశారన్నారు. దీనికి వైసీపీ నాయకుల మనసులను కూడా కలిసి వేసారన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా చాలా ప్రాంతాలను వైసీపీకి చెందిన శ్రేణులు టీడీపీకి మద్దతు తెలుపుతూ టీడీపీలో చేరుతున్నాయి అన్నారు. అందులో భాగంగా రెండు రోజులు క్రితమే జిల్లాలోని గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరేందుకు ముహూర్తం నిర్వహించారు. దీనిని గమనించిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరే నాయకులపై నిఘా పెట్టడమే కాకుండా, పోలీసులతో బెదిరింపులకు నిర్బంధాలకు గురి చేస్తున్నారన్నారు. టిడిపిలో చేరే నాయకుల నాయకుల ఫోన్లను ట్యాప్ చేయడమే కాకుండా, వాళ్ల ఫోన్లకు బెదిరింపు కాల్స్ చేస్తున్నారన్నారు. ఇద్దరు డిఎస్పీలు, 8 మంది సీఐలు, దాదాపు 30 మంది ఎస్ఐలు, 200 మందికి పైగా పోలీ సులు గిద్దలూరు ఆదివారం రోజున ఏం పని అని ప్రశ్నించారు. టిడిపిని మరింత నిర్బం ధాల గురి చేస్తే మరింతగా ఎగసిపడి ఉవ్వె త్తున ఉద్యమం లేస్తుందని హెచ్చరించారు. దీనిని నిరసిస్తూ గిద్దలూరు నియోజకవర్గంలో తనతో పాటు ముగ్గులు ప్రస్తుత సర్పంచులు, ముగ్గురు మాజీ సర్పంచులు, ఒక ఎంపీటీసీ, 200 మంది కరుదు కట్టిన వైసీపీ కార్యకర్తలు ఆదివారం టిడిపిలో చేరినందుకు నిర్ణయించుకున్నారన్నారు. అయితే గత రెండు రోజులుగా తమపై పోలీసుల వేధింపులు అధికమయ్యాయి అన్నారు. వైసిపి నాయకులు ఫోన్లు చేసి బెదిరిసున్నారు. పోలీసులు ఫోన్లు చేసి తమపై కేసులు పెడతామని హెచ్చరిస్తున్నారన్నారు. దీంతో తాను శనివారం రాత్రి తమ గ్రామం నుండి ఎవరికి చెప్పకుండా వేరే గ్రామంలో ఉండి తమ ఫోన్లను ఇంట్లోనే పెట్టి నేరుగా ఒంగోలు వచ్చి దామచర్ల, నూకసాని సమక్షంలో టీడీపీలో చేరాను అన్నారు. ఎన్ని నిర్బంధాలు వచ్చినా అందుకు కారణం గిద్దలూరులోని వైసీపీ నాయకులు, పోలీసులేనన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

- మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న వైనం
- వాహనదారులు విరివిగా హెల్మెట్ ధరించండి...
- ప్రాణాలను కాపాడుకోండి

పీసీపల్లి ఎస్ఐ కే మాధవరావు

పెద్ద అలవలపాడు గ్రామంలో యువకునికి శ్వాస నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఎస్ఐ

విశాలాంధ్ర-పీసీపల్లి : నిత్యం రోడ్డు ప్రమాదాల రూపంలో కొనసాగుతున్న మరణ మృదంగానికి వాహనదారులు హెల్మెట్లు ధరించకపోవడం అతిగా మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడపడమే కారణాలవుతున్నాయి. మద్యం మత్తు కారణంగా ప్రమాదాలు నివారించేందుకు పోలీసులు తనిఖీలు చేస్తున్నప్పటికీ ఫలితాలు అనుకూలంగా రావడం లేదు. రోజురోజుకు ప్రమాదాల సంఖ్య పెరుగుతుండడంతో పోలీసులు కఠిన వైఖరి అవలంబిస్తున్నారు నిత్యం శ్వాస నిర్ధారణ పరీక్షలు చేసి తాగి వాహనం తోలుతున్నట్లు తేలితే కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నారు. మద్యం ఆరోగ్యానికి ముప్పు అని మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదమని నిత్యం వివరిస్తూనే ఉన్నారు. అయినా ఎవరు అవలంబించడం లేదు. పెద్దలు యువత అక్షరాస్యులు నిరక్ష రాస్యులు అందరూ ఇదే తీరును వ్యవహరిస్తూ ట్రాఫిక్ నిబంధనలను అనుసరించడం లేదు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి ఇటువంటి పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. మద్యం తాగి రోడ్లపైకి వాహనాలతో వస్తామంటే పోలీసులు ఇక కుదరదు పొమ్మంటున్నారు ఈ నేపథ్యంలో నిత్యం తనిఖీలు నిర్వహించటం వాహన చోదకులకు బ్రీత్ అనలైజర్‌తో తనిఖీలు చేయడం చేపడుతున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపి నిబంధనలను అతి క్రమించవద్దని పోలీసులు సూచిస్తు న్నారు మరి కొన్నిచోట్ల కుటుంబ సభ్యులపైన ప్రమాణాల సైతం చేస్తున్నారు బెదిరించినా భయపెట్టిన తీరు మారకపోతే కేసులు నమోదు చేస్తామంటున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారి లైసెన్స్ వాహన పత్రాలను స్వాధీనం చేసుకుంటున్నారు. మద్యం సేవించి ఒంటరిగా వాహనాన్ని నడుపుకుంటూ వెళితే వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారు. అదే ఇద్దరు వ్యక్తులు వాహనంపై ఉంటే అందులో ఒకరు మద్యం సేవించకపోతే ఆ వ్యక్తి సొంత పూచికత్తుతో వాహనాన్ని అప్ప జెప్తున్నారు. ఆపై కోర్టులో హాజరుపరిసి జరిమానా లేదా జైలు శిక్ష విధిస్తున్నారు.

విస్తృతంగా తనిఖీలు - పీసీపల్లి ఎస్ఐ కే మాధవరావు :- మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్నడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. తప్పనిసరిగా ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్లు ధరించి వాహనాలు నడపాలి. మండల ముఖ్య కేంద్రాల్లో గ్రామాల్లో ఎప్పటికప్పుడు వాహనాలను విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టు పడితే కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నాం వీరికి జరిమానాలతో పాటు జైలుశిక్ష సైతం విధించే అవకాశం ఉంది. ప్రజలందరూ మద్యం సేవించి వాహనాలు నడపకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని కోరుకుంటున్నాను.

ఘనంగా లైన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

విశాలాంధ్ర-ఒంగోలు: స్థానిక హోటల్ ఆస్ట్రోనా నందు లైన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా పట్టణంలోని ప్రముఖ స్వీట్ షాప్ అధినేత సొల్లేటి వెంకట్, కార్యదర్శిగా బచ్చు సురేష్ కుమార్,కోశాధికారిగా గ్రంధి పార్థసారథి మరియు వారి కమిటీచే క్లబ్బు మాజీ గవర్నర్ విజయ్ చంద్ ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే క్లబ్బులో కొత్తగా ప్రవేశిస్తున్న నూతన సభ్యులచే మల్టిపుల్ సెక్రటరీ బాలస్వామి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన క్లబ్ అధ్యక్షులు సొల్లేటి వెంకట్ మాట్లాడుతూ ఈ సంవత్సర కాలంలో క్లబ్బు ద్వారా మంచి సేవా కార్యక్రమాలు నిర్వహించి క్లబ్బును కమిటీ సభ్యుల సహాయ సహకారాలతో ముందుకు తీసుకెళ్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మొదటి గవర్నర్ గోపీచంద్, రెండవ గవర్నర్ హరి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త సిద్ధ సురేష్,క్లబ్ ఫౌండర్ కూరపాటి రమేష్,క్లబ్ పూర్వపు అధ్యక్షులు పల్లపు సుబ్బయ్య, తమ్మినేని ఆంజనేయులు, పబ్బిశెట్టి జనార్ధన్, క్లబ్ సభ్యులు నైనాల రామకృష్ణ, పువ్వాడ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

ఉరంతా ఉత్సవం ఒమ్మెవరంలో ఒకే వినాయకుడు

విశాలాంధ్ర-నాగులప్పులుప్పపాడు : వినాయక చవితి వచ్చిందంటే ఆ ఊరంతా తొమ్మిది రోజుల పాటు ఉత్సవమే... పార్టీలు, వర్గాలు, కులాల అంతరం కూడా లేకుండా వినాయకుని ఐక్యంగా పూజిస్తారు. తొమ్మిదిరోజుల పాటు వారి వంతుల వారిగా కుటుంబాలు పూజలు నిర్వహించి చివరి రోజు ఉపాధి కోసం వలస వెళ్లిన యువతకు అవకాశం ఇస్తారు. ఆ తర్వాత గ్రామోత్సవం నిర్వహించి అనంతరం ఇంటిళ్లపాది సముద్రంలో నిమజ్జనం చేస్తారు. ఇలా ఒక ఏడాదో రెండేళ్లో అనుకుంటే పొరపాటే ఏకంగా 25 ఏళ్లగా నిర్వహిస్తూ, ఇలా మండలంలోని ఒమ్మెవరం గ్రామస్థులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలోని ఒమ్మెవరం గ్రామంలో సరిగ్గా 25 ఏళ్ల క్రితం గ్రామ వినాయకుడిని ఏర్పాటు చేశారు. తొలి ఏడాది నుంచే ఈ వేడుకలను ఐక్యంగా నిర్వహించడం మొదలు పెట్టారు. ఇక పూజలు ఉభయం ఇవ్వడానికి వంతుల వారిగా విభజించారు. వారి కుటుంబాల ఉభయం రోజు కుటుంబ సభ్యులు వినాయకునికి పూజలు చేస్తారు. ఘనంగా స్వామివారికి ఉభయం ఇచ్చి ఉరందరికి పంచిపెడతారు. ఉభయం ఇవ్వడం కోసం ప్లేటులో పెట్టే పిండివంటలు, స్వీట్ల కోసం పోటీ పడడం గమనార్హం.

కార్యక్రమ నిర్వహణ :- గ్రామంలో తొలి రోజు విగ్రహం ఇచ్చిన దాతలు పూజలు నిర్వహిస్తారు. ఇక ఆ తర్వాత గ్రామంలోని ఇంటిపేరు ముఠాల వారీగా పూజలు నిర్వహిస్తారు. వీరితో పాటు రజకులు, నాయీబ్రాహ్మణులు ఒకరోజు వైశ్యులు, బ్రాహ్మణులు, విశ్వబ్రాహ్మణులు మరో రోజు యాదవులు ఒక రోజు ఉభయదాతలుగా ఉంటూ స్వామివారి పూజలు నిర్వహిస్తారు. ఇక ప్రధాన సామాజికవర్గం కమ్మ కులంలో ఐదు ముఠాల వారు ఒక్కోరోజు వంతుల వారిగా ఉభయదాతలుగా ఉంటూ వారి ముఠా వంతు వచ్చిన రోజు ఇంటిల్లపాది స్వామి వారికి ఉభయదాతలుగా, పూజలు చేస్తారు. ఇక చివరి రోజు ఉత్సవం కోసం గ్రామం నుంచి ఉపాధి కోసం వెళ్లిన యువత గ్రామానికి వస్తారు. ఆ రోజు వారు ఉభయ దాతలుగా ఉంటూ, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, గ్రామోత్సవం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం పెద్దగంజాంలోని తీర ప్రాంతానికి స్వామివారిని తీసుకుపోయి నిమజ్జనం చేస్తారు.

ఉభయం కోసం పోటీ :- ముఠాల వారీగా ఉభయం ఇచ్చే సమయంలో స్వామివారికి పిండివంటలు, స్వీట్లు సమర్పించడానికి పోటీపడతారు. ఈ తొమ్మిదిరోజులు సరాసరిన ప్రతి రోజు తొమ్మిది పిండివంటలు ఉండడం గమనార్హం. పులిహోర, పొంగలి, బజ్జీ, పూర్ణం, వివిధ పండ్లు, స్వీట్లతో స్వామివారికి ఘనంగా నైవైద్యం సమర్పిస్తారు. ఐక్యంగా నిర్వహించే ఈ గ్రామ వినాయకుని సంబరాలకు మండలంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. 25 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ తరహా ఉత్సవం నేటికీ అదే స్ఫూర్తితో నిర్వహిస్తుండడం గమనార్హం.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

మండల టీడీపీ అధ్యక్షులు శ్రీనివాసరావు

విశాలాంధ్ర-ముండ్లమూరు : రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని మండల టిడిపి అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉలగల్లు గ్రామంలో ఆదివారం రాత్రి బాబు తోనేను అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత అభివృద్ధి సంక్షేమ లక్ష్యంగా చంద్రబాబు పని చేస్తుంటే ఆధారాలు లేని కుట్రలు పన్నడం హేయమైన చర్య అని అన్నారు. ఓటమి భయంతోనే వైకాపా నాయకులు కుట్రలు కుతంత్రాలు పన్నారని అన్నారు. పింక్ డైమండ్, వివాహ హత్య, రాజధానిలో అక్రమాలు అంటూ అనేక ఆరోపణలు చేసి రుజువు చేయలేక చేతులెత్తేసిన జగన్ తన పంతం నెగ్గించుకోవడానికి ఆధారాలు లేని స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబును అరెస్టు చేశారని ఆయన అన్నారు. రాష్ట్రంలో అరాచక ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తూ ప్రజల మధ్య ఉన్న చంద్రబాబుని అర్ధరాత్రి వేళ అనాగరికంగా అరెస్టు చేసిన విధానం రాష్ట్ర ప్రజలంతా చూస్తున్నారని ఆయన మండిపడ్డారు. మాజీ సర్పంచి జిల్లెల మూడి చౌదరి, కామని పూర్ణచంద్రరావు, ఉల్లగల్లు గ్రామ పార్టీ అధ్యక్షుడు బాలయ్య, మానం నాగేశ్వర రావు, కంచుమాటి శ్రీనివాసరావు, శంకరాపురం గ్రామ టీడీపీ అధ్యక్షుడు మందలపు అజయ్, మేడికొండ రామాంజనేయులు, మేడికొండ హనుమంతరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుండమ్మ ప్రాజెక్టు కొరవ పనులను వెంటనే పూర్తి చేయాలి

- ప్రాజెక్టు పనులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ ఐదు నుండి 8 వరకు పాదయాత్ర
- 9వ తేదీన కలెక్టరేట్ వద్ద మహా ధర్నా
- కార్యక్రమాలు జయప్రదం చేయాలని గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘం పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు: గుండ్లకమ్మ ప్రాజెక్టుకు వరదలతో కొట్టుకుపోయిన మూడో నెంబరు వెంటనే నిర్మించాలని, మధ్యలో నిలిచిపోయిన నీటి కాలువల పందు పూర్తి చేసి ప్రాజెక్టు ఆయకట్టు చివరి భూముల వరకు నీరు అందించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 5వ తేదీ నుండి 8వ తేదీ వరకు నిర్వహించే పాదయాత్రను, అలాగే తొమ్మిదవ తేదీన ఒంగోలు కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘం ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమా రెడ్డి మాట్లాడుతూ గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి 14 సంవత్సరాలు పూర్తయినప్పటికీ సాగునీరు తాగునీరు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రాజెక్టు నిర్వహణ లోపం కారణంగా మూడో నెంబరు గేటు కొట్టుకుపోయి ఏడాది దాటుతున్న ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించిన కారణంగా రెండు టీఎంసీల నీరు సముద్రం పాలయ్యిందన్నారు. సాగునీరు, తాగు నీరు ఎద్దడి ఏర్పడి ఆయకట్టు ప్రాంతంలోని రైతులు ప్రజలు తీవ్ర నష్టాలకు, ఇబ్బందులకు గురవుతున్నారు. గేట్ల మరమ్మతులకు సుమారు రూ. పది కోట్లు అవసరమని అధికారులు నివేదిక పంపినప్పటికీ నిధులు విడుదల చేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగం పట్ల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు. ఖరీఫ్‌లో 60000 ఎకరాలు, రబీలో 80,000 ఎకరాలు సాగునీరు, 43 గ్రామాల ప్రజలకు, ఒంగోలు పట్టణ ప్రజలకు తాగునీరు అందించే లక్ష్యంతో నిర్మించిన ప్రాజెక్టు నిరిపయోగంగా మారిందన్నారు. కాలువలో నీటి పారుదలకుండా పెరిగిన తూటు, జమ్ము, చిల్లచెట్లను తొలగించాలని, కాలువల కొరవ పనులను పూర్తి చేయాలని, అర్థాంతరంగా కాలువలను పొడిగించి వ్యవసాయ భూములు ముంపుకు గురికాకుండా కాపాడాలని, నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని, చనిపోయిన నిధులు కేటాయించి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రశ్నించిన, రైతు సంఘాల నేతలు చిన్నపాటి సలహాలు సూచనలు ఇచ్చిన సహించలేని స్థానిక ఎమ్మెల్యే అసత్యాలు ప్రచారం చేస్తూ బురద చల్లెందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగని మోసం చేస్తున్న ప్రజాప్రతినిధులను ముఖం చూసేందుకు కూడా ప్రజలు ఇష్టపడటం లేదన్నారు. లక్ష 25 వేల ఎకరాలకు సాగునీరు అందించ కుండా సముద్రం పాలు చేసి లక్షలాది కుటుంబాల జీవనోపాధి లేకుండా చేసిన ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే లకు గ్రామాలలో తిరిగి కనీస హక్కు కూడా లేదని ధ్వజమెత్తారు.గుండ్లకమ్మ సమస్యపై జరుగుతున్న ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు కే హనుమంతరావు మాట్లాడుతూ సాగు నీటి ప్రాజెక్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ప్రాజెక్టు సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమం సాగిస్తామన్నారు. సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి మాట్లాడుతూ లక్షలాదిమంది ప్రజల తాగునీరు, వేలాది ఎకరాల భూముల సాగునీరు అందించడానికి నిధులు కేటాయించలేని రాష్ట్ర ప్రభుత్వానికి ఒక నిమిషం కూడా పరిపాలించే హక్కు లేదని అన్నారు. కార్యక్రమానికి ముందుగా అక్టోబర్ 5వ తేదీ నుంచి నిర్వహించే పాదయాత్రకు సంబంధించిన కరపత్రాన్ని రైతు సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు ఎస్ డి సర్దార్, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి లలిత కుమారి, గుండ్లకమ్మ ఆయకట్టు రైలు సంఘం నాయకులు మండవ రంగారావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ఒంగోలు చీరాల జాతీయ రహదారిపై చదలవాడ వద్దనున్న గుండ్లకమ్మ బ్రిడ్జిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన కొమ్ము అనిల్ ఆదివారం మృతి చెందాడు. ఒంగోలు రిమ్స్ లో చికిత్స పొందుతూ మృతిచెందగా పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్ఐ ఉయ్యాల హరిబాబు తెలిపారు. చదలవాడకు చెందిన వాలంటీర్ సుధీర్ పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు తరలించారు.

ఇంటింటి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

విశాలాంధ్ర-గిద్దలూరు : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఆరోగ్య సర్వే పట్టణంలోని కోట గడ్డ, కొంగళవీడు రోడ్డు,సచివాలయం, అర్బన్ కాలనీ, శ్రీనివాస సెంటర్ కాలనీ సచివాలయ పరిధిలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమములో భాగంగా ఇందులో భాగంగా వాలంటీర్ల సహకారంతో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలందరి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని,అనారోగ్యంతో ఉన్న ప్రజలను గుర్తించి తగిన పరీక్షలు చేసి వారి సంబంధిత వివరాలతో ఏఎన్ఎంలు ప్రత్యేకగా కేసు షీట్ లో నమోదు చేసి ఆరోగ్య శిబిరంకు సంబంధించిన టోకెన్‌లను పంపిణీ చేశారు.అదేవిధంగా పట్టణంలోని ఐదు సచివాలయాలకు అక్టోబర్ 7వ తేదీన ఆరోగ్య శిబిరం కోటగడ్డ యు.పి.హెచ్.సిలో జరుగునని శిబిరం రోజున స్పెషలిస్టు వైద్యులు వస్తారని, తగు పరీక్షలు, అవసరమైన చికిత్సలను మందులు అందజేస్తారని ఆయన తెలిపారు.

అధినాయకుని నిమజ్జనోత్సవంలో మద్దిశెట్టి

వినాయకుని పూజా కార్యక్రమంలో మద్ది శెట్టి రవీంద్ర తదితరులు

విశాలాంధ్ర-తాళ్లూరు : దర్శి శాసనసభ్యులు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరులు తాళ్లూరు మండల వైసీపీ ఇన్‌ఛార్జ్ మద్దిశెట్టి రవీంద్ర ఆదివారం మండలంలోని విఠలాపురం, మాధ వరం గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విఠలాపురం గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినా యక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జోత్సవాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మద్దిశెట్టి రవీంద్రను, జడ్పిటిసి మారం వెంకటరెడ్డిని గుర్రంపై ఊరేగిస్తూ డప్పు వైద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. గుర్రంపై వారు ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాధవరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైయస్సార్ యూత్ గణేష్ నిమజ్జనోత్సవంలో ఆయన పాల్గొని విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలను, మండలాన్ని చక్కగా కాపాడాలని కోరుకున్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ తాటకొండ శ్రీనివాసరావు, మండల ఉపాధ్య క్షులు ఐ వెంకటేశ్వర్ రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు కరీముల్లా, విఠలాపురం గ్రామ మాజీ సర్పంచ్ అంజిరెడ్డి, గ్రామ వైసిపి నాయకులు ,మాధవరం గ్రామ సర్పంచ్ తాటికొండ రేణుక ,వైసీపీ నాయకులు జయరామిరెడ్డి, బెల్లంకొండ వారి పాలెం సర్పంచ్ పి సుమలత శ్రీకాంత్ రెడ్డి, రజానగరం సర్పంచ్ ఎస్కే కాలేషా వలి ,వైసీపీ నాయకులు విష్ణు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు, పాల్గొన్నారు.

మేకల వారి కేశఖండన మహోత్సవ కార్యక్రమం

విశాలాంధ్ర-కొమరోలు : ప్రకాశం జిల్లా కొమరోలు మండలం అల్లినగరం పంచాయతీలోని యర్రగుంట్ల గ్రామంలో మేకల వెంకటేశ్వర్లు, మేకల పార్వతి, కేశఖండన మహోత్సవ సందర్భంగా విందు కార్యక్రమంలో కొమరోలు మండలంలోని చింతలపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్ సారె జనార్దన్ నాయుడు, స్థానిక ఎంపీటీసీ జాజం వెంకట రమణ అల్లినగరం వైస్సార్ సీపీ నాయకులు గోల్కొండ అబ్దుల్ సుబాన్, మేకల నాగేంద్ర, గోల్కొండ. సత్తార్, కాకర్ల కాశింవలి, దాసరి బాస్కర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కెపిని కలిసిన ఎంపి మాగుంట కుమారుడు రాఘవరెడ్డి

విశాలాంధ్ర-మార్కాపురం : ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి కుమారుడు రాఘవరెడ్డి ఆదివారం పట్టణంలో జరుగుతున్న పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మార్కాపురం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తన కుటుంబానికి ఆప్తులైన పశ్చిమ ప్రాంత సీనియర్ రాజకీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కెపి కొండారెడ్డి నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మర్యాదా పూర్వకంగా కెపి కొండారెడ్డిని కలిసి ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇరు కుటుంబాల మధ్య గత మూడున్నర దశాబ్దాలుగా కొనసాగుతున్న అనుబంధాన్ని వారు గుర్తు చేసుకున్నారు. కెపి నివాసానికి చేరుకున్న మాగుంట రాఘవరెడ్డికి తొలుత ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సిహెచ్ అంజమ్మ శ్రీనివాస్, శ్రీశైలం దేవస్థానం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ సిహెచ్ కనకదుర్గ, మున్సిపల్ కౌన్సిలర్ బుస్సెట్టి నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం. మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు స్వాహా చేసిన వారిపైచర్యలు

జడ్పీ సీఈవో జాలిరెడ్డి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీలోని నిధులు స్వాహా చేసిన వారిపై చర్యలు తప్పవని జెడ్పీసీఈఓ జాలిరెడ్డి సూచించారు. ఆదివారం ఉప్పు గుండూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ ఎంతో పేరు ప్రఖ్యాతులున్న ఉప్పుగుండూరు గ్రామ పంచాయ తీలో అక్రమాలు జరిగిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. పత్రికలో వచ్చిన కథనాలపై విచారణాధికారి డిఎల్‌పిఓ పద్మావతితో మాట్లాడటం జరిగిందన్నారు. విచారణ చివరి దశలో ఉందని విచారణ నివేదిక అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఉప్పుగుండూరులో జరిగిన జల్ జీవన్ మిషన్ పథకం పనులపై కూడా విచారణ చేపడతామని తెలిపారు. ఆయన వెంట ఈఓఆర్‌డి ఏవివి కుమారి సర్పంచ్ దేవరకొండ జయమ్మ ఉన్నారు.

వాలంటీర్ల పై జడ్పీ సీఈఓ ఆగ్రహం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ఉప్పుగుండూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం సర్వే విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న వాలంటీర్లపై జడ్పీ సీఈఓ జాలి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ నెల 30న ఉప్పుగుండూరులో సురక్ష పథకం క్యాంపు నిర్వహించనుండగా వాలంటీర్లు సర్వే చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నందున ఆదివారం ఉప్పుగుండూరు పంచాయతీ కార్యాలయంలో వాలంటీర్ల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు సురక్ష సర్వేను వేగవంతం చేసి త్వరితగతను పూర్తి చేయాలని ఆదేశించారు ఆయన వెంట ఈఓఆర్‌డి కుమారి సర్పంచ్ దేవరకొండ జయమ్మ తదితరులు ఉన్నారు.

నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణనాధుడు

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : మండలంలోని కొత్తూరు గ్రామం వద్ద గల పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ వద్ద, మెగా కంపెనీ వారు ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి ఏడు రోజులపాటు ప్రత్యేక పూజలు చేసి, ఏడవ రోజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి గణేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెగా కంపెనీ జిఎం రాంబాబు సైట్ ఇంజనీర్ శ్రీనివాసరావు మెగా కంపెనీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకారంతో సత్యమాంబ దేవి

విశాలాంధ్ర-కంభం : కంభంలోని సత్తెమ్మ గుడిలో ఆదివారం ఆలయ పూజారులు సత్యమాంబ దేవిని ప్రత్యేకంగా అలంకరించారు. సత్యమాంబ దేవి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని భక్తి శ్రద్ధలతో దర్శించుకుని పూజలు చేశారు. భక్తులు ఏ కోరిక కోరుకున్న అమ్మవారు కోరికలు తీరుస్తారని అపార నమ్మకం. ఆలయ ధర్మకర్తలు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హిందీ టీచర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ మొర్రి.పిచ్చయ్యకు ఘన సన్మానం

విశాలాంధ్ర-గిద్దలూరు : ప్రకాశం జిల్లా హిందీ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం పొదిలిలో హిందీ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల హిందీ స్కూల్ అసిస్టెంట్స్ నుంచి హెడ్ మాస్టర్‌గా పదోన్నతి పొందిన వారికి, ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికైన ఉపాధ్యాయులకు ఘన సన్మానం చేశారు. ప్రకాశం జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్యకు ఇటీవల తెలంగాణ రాష్ట్రం నుంచి గురుబ్రహ్మ పురస్కారం-2023 వచ్చిన సందర్భంగా రాష్ట్ర హిందీ టీచర్స్ గౌరవాధ్యక్షులు పటాన్ మహబూబ్ ఖాన్, మార్కాపురం డిప్యూటీ డీయివో చంద్రమౌళీశ్వర్, ప్రకాశం జిల్లా డి.సి.ఇ.బీ సెక్రటరీ వెంకట్రావ్‌ల చేతుల మీదుగా ఘన సన్మానం జరిగింది. జిల్లాలోని వివిధ డివిజన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొని అవార్డు గ్రహీత డాక్టర్ మొర్రి పిచ్చయ్యను అభినందించి, దుశ్శాలువలతో, పూలమాలలతో సన్మానించారు.

చంద్రబాబు అక్రమ అరెస్టుపై ప్రజలు అవగాహన

విశాలాంధ్ర-కనిగిరి : పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుపై కనిగిరిలో తెలుగు మహిళ ఆధ్వర్యంలో ఆదివారం "బాబుతో నేను" మహాశక్తి చైతన్య యాత్ర దేవాంగ నగర్ జరిగింది. ఈ సందర్భంగా తెలుగు మహిళలు కరపత్రాలు పంచుతూ వైసిపి ప్రభుత్వం అన్యాయంగా చంద్రబాబునాయుడు కేసులో ఇరికించంపై అవగాహన కల్పించాలన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుపై 92612 92612 నంబరుకు మిస్సింగ్ కాల్ ఇస్తూ మద్దతు అడిగారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలుఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు కరణం అరుణ, వాజీదా బేగం, నారాయణమ్మ, దొరసాని, పార్వతి, లక్ష్మీ, నీరజ, సమీర, రమణ, బషీర్ బి, భాగ్యలక్ష్మి, ఫాతిమా, వెంకట లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

ఎవర్ గ్రీన్ అక్కినేని నాగేశ్వరరావుకు నివాళులు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : అక్కినేని నాగేశ్వరరావు 100వ జయంతి సందర్భంగా ఆదివారం వైయస్ఆర్ సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షేక్ బుజ్జి తన మిత్రునితో కలిసి హైదరాబాదులోని అన్నపూర్ణ స్టూడియోలో అక్కినేని నాగేశ్వరరావు 100వ జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ ఎవర్‌గ్రీన్ అక్కినేని నాగేశ్వరరావు అన్నపూర్ణ స్టూడియోలో విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. నాగేశ్వరరావు కుమారుడు అక్కినేని నాగార్జున తండ్రిమీద ఉన్న అభిమానంతో విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందించదగ్గ విషయమని అన్నారు. అక్కినేని నాగేశ్వరరావుపై ఉన్న అభిమానంతో పూలమాలలతో ఆదివారం నివాళులు అర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మిత్రులు బోయన మహేంద్ర, షేక్ షాహిద్, షేక్ అహ్మద్, లక్ష్మీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కదిరిని కలిసిన కోవిలంపాడు సర్పంచి బుజ్జి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావును కోవిలంపాడు సర్పంచి షేక్ ఖాదర్‌బి బుజ్జి ఆదివారం హైదరాబాదులోని జుబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కలిశారు. గత నెలలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు అమెరికా పర్యటనకు వెళ్లగా వైయస్ఆర్ పార్టీ సమావేశాలు ముగించుకొని తిరిగి ఆదివారం హైదరాబాదు రావడంతో కోవిలంపాడు సర్పంచి షేక్ ఖాదర్‌బి బుజ్జి తన మిత్రులతో తన నివాసంలో కలిశారు. ఖాదర్‌బి బుజ్జి మాట్లాడుతూ అమెరికా పర్యటన ముగించుకొని హైదరాబాదు వచ్చిన సందర్భంగా తనను కలిసి మండలం గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బోయన మహేంద్ర, షేక్ షాహిద్, రహిమాన్, శ్రీనివాసులు, గౌష్ తదితరులు పాల్గొన్నారు.